# సాధించుకొన్న స్వాతంత్ర్యం

సరస్వతికి అందరిమాదిరిగానే తల్లితండ్రులున్నారు. అందరి తల్లితండ్రులుమాదిరిగానే వాళ్ళూ ఆమెకు బాల్యంలోనే వివాహం చేశారు. రజస్వల కాంగానే కార్యం చేసి కాపరానికి పంపారు. అత్తా, ఆడబిడ్డల అదుపు ఆజ్ఞల్లో మెలకువగానే కాపురం చేస్తూవచ్చింది. కడుపున ఒక కాయకూడా కాచింది. అదృష్టవశాత్తూ అనుకోండి, లేదా దురదృష్టవశాత్తూ అనుకోండి ఆ కాయ మగపిల్లకాయ. వాడి మూడోయేట సరస్వతికి వైధవ్యం ప్రాప్తించింది. కర్మకాండల తర్వాత, కానువాయి ప్రకారం ఓదార్చి ఆదరించి తిరిగి పంపిస్తామని చెప్పి పుట్టింటివారు తీసుకొచ్చారు. కొన్నాళ్ళయిం తర్వాత సరస్వతిని అత్తవారింట దిగపెట్టి రావటానికి తండ్రి స్వయంగానే తల్లీ బిడ్డల్ని తీసుకెళ్ళేడు. తీరా వెళ్ళి గడపలో అడుగుపెడితే "వచ్చారా" అనేనాథుడు లేకపోయ్యాడు. వియ్యంకుడు చంగున లేచి ఉత్తరీయం వేసుకొని ఏదో ముంచుకొనిపోతున్నట్టు నిష్క్రమించాడు. వియ్యపురాలు ఏవో పని వున్నట్టుగా వంటింట్లోనే పాతుకుపోయింది. ఆడబిడ్డలు మూతి విరుచుకొని లోపలి కెళ్ళారు. కాని తలుపు సందుల్నించి చూడటం మాన లేదు. పిల్లవాడు "అత్తయ్యా" అంటూ






శర్మ

లోపలికెళితే వినిపించుకొన్నవాళ్ళు లేరు. గుడ్లనీళ్ళు కుక్కుకొంటూ వాణ్ణి "ఇలారా నాయనా" అని పిలిచి సందిట్లోకి తీసుకొంది. సరస్వతి తండ్రి ఉస్సురంటూ అలా చతికిలపడ్డాడు. బావగారూ, మరదులూ మరో దోవనే వీళ్ళని తప్పించుక తిరుగుతున్నారు. సాయంత్రం అయింది. సంజచీకటి పడ్డది. అలనాపాలనా లేదు. నిట్టూర్పుతో తండ్రి లేచి "ఇంకెందు కమ్మాయీ లే!" అని కూతురూ మనమళ్ళతో తిరోధానుడయ్యేడు, అందరికీ వినపడేట్టుగానే "నా బిడ్డ, నా మనమళ్ళు నాకు బరువనుకొన్నారా" అంటూ.

కొన్నాళ్ళకేదో మాయదారి జబ్బొచ్చి సరస్వతి కొడుకుకూడా పోయినాడు. పొరుగింటి శాస్త్రుల్లుగారి కెక్కడో పిల్లవాడి పితామహు డవుపించి ఇకిలిస్తూ "వాడు కూడా పోయ్యాట్టే" అన్నాట్ట. శాస్త్రుల్లుగారు జవాబిచ్చేలోపలనే పితామహుడు ఇకిలిస్తూనే అంతర్ధానమయ్యాట్ట.

* * *

సరస్వతి తండ్రి కూతురిపేర తన స్వార్జితములోనుంచే రెండెకరాల మాగాణిని సర్వహక్కులతో సరస్వతికి వ్రాసిచ్చేడు తన తదనంతరం కూడా సరస్వతి కేలోపం రాకుండా వుండేందుకు. కాని ఆ రోజు నుంచీ మటుకు ఇంట్లో పెద్దన్నయ్య తదితరులు మాత్రం అయినదానికీ కానిదానికీ, చెట్టుమీద పెట్టీ పుట్టమీద పెట్టీ చిర్రుబుర్రుమంటూండటం సాగించారు. అసలు సరస్వతి కూడా, మొదట తండ్రి త్యాగాన్ని మందలించింది. "నాన్నా! నువ్వూ అన్నయ్యావాళ్ళుంటూ వుండగా నాకేం లోపం అవుతుంద"ని. తండ్రి మాత్రం "నీకేం తెలియదు. చిన్నదానివి. నేనన్నీ ఆలోచించే చేశాను" అన్నాడు.

సరస్వతి తల్లికి మాత్రం ఈగోలే పట్టలేదు. ఆవిడ బెంగల్లా సరస్వతి వైధవ్యాన్నెలా శాస్త్రోక్తంగా సరిదిద్దాలా అనే. అందువల్ల ఆమె ఆ సన్నాహంలోనే వున్నది. ఇక సరస్వతి తమ్ముడున్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. సంస్కారప్రియుడు. అక్కగారి వైధవ్యదీక్షనుగూర్చి అమ్మ ప్రసంగం తెచ్చినప్పుడల్లా తమ్ముడు తల్లితో హోరాహోరిగా యుద్ధం చేస్తూనే వున్నాడు. చివరికి ఒకానొకరోజున సరస్వతి కేశఖండన ముహూర్తం ముంచుకొచ్చింది, ఆరోజున ఆయింట్లో— గాలి దుమారం రేగింది. ముఖ్యంగా తమ్ముడు కారణంగా. సరస్వతి మాత్రం పరిస్థితులని గమనిస్తూనే వుంది. కాని ఇంకా తమ్ముణ్ణి "ఎందుకురా నీకీ బెడద" అంటూ సూచనగా మందలిస్తూ వచ్చింది. తమ్ముడు పట్టు విడవలేదు. అమ్మతో ఘర్షణ ఎక్కువైంది. తండ్రి నాదేం లేదన్నట్టు అంటిముట్టని అగ్రహారంలా వూరుకొన్నాడు. అన్నగారు పరిస్థితులింకా ముదరకపూర్వమే వుద్యోగరీత్యా దూరస్థుడయ్యేడు. ఇక అక్కగారి సముద్ధరణాభారమంతా తమ్ముడు తనమీద వేసుకొన్నాడు. ఇంతకూ తమ్ముడి పట్టుదలేమిటంటే ఒకటి, కేశఖండన వల్లకాదని, రెండు, సత్వరం అక్కగారికి పునర్వివాహం చేసి తీరాలనీ. ఆయింట్లో అలజడికి ముఖ్యంగా రెండేవడి కారణం. చివరికి అమ్మతో ఘర్షణ పెద్దదయింది. ఆ స్త్రీ కోపంలో చెయ్యి చేసికొన్నాడు. ఇక పట్టలేక సరస్వతి తమ్ముడికి అడ్డంవచ్చి ఉగ్రకాళిలా

"తమ్ముడూ! పో అవతలకిపో! ఊ..." అని ఆజ్ఞాపించింది. తమ్ముడు నిర్ఘాంత పోయి ఏదో చెప్ప ప్రయత్నిస్తున్నాడు.

"ఊహు. ముందు ఎవంగాపో. తర్వాత" అని తిరిగి గద్దించింది. అది అక్కగారు ఆజ్ఞాపిస్తున్న ట్లనిపించలా. ఏదో స్త్రీశక్తి, పరాశక్తి ఆజ్ఞాపిస్తున్న ట్లనిపించింది. వెనక్కి తగ్గాడు, గతుక్కుమంటూ.

"ఛీ మూర్ఖుడా! ఇదా నీ ప్రయోజకత్వం. అమ్మమీదనా నీ తిరుగుబాటూ... సిగ్గు లేదు. కళ్ళంటూవుంటే చేసిందానికి కళ్లు బొత్తలుపడేట్టు ఏడు" అంది.

"అది కాదే అక్కయ్యా!...స్త్రీ..." అని తమ్ముడేదో చెప్పబోతున్నాడు. తిరిగి సరస్వ తందుకొన్నది. "ఆఁ. తెలుసు... నేటికొక్కగా నీ అక్క విధవయ్యిందిగదా అని ఇదే సమయం ప్రపంచానికి నీవుకూడా ఒక సంఘసంస్కర్త నని చాటుకొండా మని" అంతేనా అని గద్దించింది.

"చాటుకొందామని కాదక్కయ్యా... నన్ను అపార్థం చేసికొన్నావు..." అని బావురుమన్నాడు. తిరిగి యిలా ప్రారంభించింది సరస్వతి. "కాకపోతే మరేమిటి. స్త్రీస్వాతంత్ర్యం గూర్చి నీ అపోహాలు... యుగయుగాలుగా పురుషుడు నిర్ణయించిన అదుపు ఆజ్ఞల్లోనే మెదులుకొంటూ వచ్చింది స్త్రీ. తీరా స్వాతంత్ర్యం కావాల్సిన సమయంలో కూడా ఆ స్త్రీ స్వాతంత్ర్యం అంటే ఏమిటో పురుషుడే నిర్ణయించాలా. పురుషుడే నిర్ణయించిన స్వాతంత్ర్యమే స్త్రీ నెత్తిపై రుద్దబడాలా? దానికి స్త్రీ యిష్టాయిష్టాలతో సంబంధం లేదా? స్వాతంత్ర్యంకూడా పురుషులు నిర్ణయించినదే, బలవంతాన స్త్రీకి కట్టపెట్టాలా? ఇదే నా స్వాతంత్ర్యం. స్త్రీకి ఏపరిస్థితుల్లో ఏస్వాతంత్ర్యం కావాలో స్త్రీనే నిర్ణయించుకోనియ్యి. అందుగాను కావాల్సింది స్త్రీకి అవకాశం అంతే. అర్థమయ్యిందా? యిప్పటికయినా..." అని గర్జించింది. తమ్ముడు కిక్కురుమనకుండా మేకపిల్లలా అప్పటికి అక్కడనుంచీ తప్పుకొన్నాడు. నీరసంగా, అక్కగారికిమరిముఖంచూపలేక.

అంతే సరస్వతి కాళీరూపం ఏమయిందో తెలియదు. తిరిగి స్త్రీరూపం దాల్చింది. కాదు తల్లిముందు బిడ్డ రూపం దాల్చింది. తల్లికాళ్ళమీద పడ్డది పలవలా ఏడుస్తూ.

"అమ్మా! నువ్వూ స్త్రీవేకదా విధవయినంత మాత్రాన నన్ను స్త్రీకి యితరమయిన ప్రాణినిగా చూస్తావెందుకు. స్త్రీజాతిపై స్త్రీకే అందులోనూ కన్నబిడ్డపై కన్నతల్లికే సానుభూతి అంతఃకరణా నశించిందా? ఒక్కటడుగుతాను చెప్పు. ఆడదానికి అందులోనూ మన భారతస్త్రీకి ఆఖరు ప్రాణం, ప్రాణాల్లోకల్లా ప్రాణం తనతల నీలాలేగద. వాట్నికూడా తెంపేస్తావా. నన్నిలాగూడా బ్రతకనియ్యవా? ఆయన పోయారు. వాడుకూడా పోయాడు...... వీట్నన్నా వుండనియ్యవా?... నా ప్రాణాల్ని నిలువునా తీసేస్తావా?...నిజంగా నీకు తీసెయ్యాలనిపించిందా. అంత వెక్కసమైనయ్యా అవ్వి...నిజం చెప్పు...నలుగురికీ జడిసి కాదు నువ్వు తలపెటింది.. నలుగురికోసమై నన్ను బలిచేస్తావా...... అమ్మా...అమ్మా...అమ్మవు కాదూ?... నువ్వు నా తల్లివి కావూ" అని బావురుమని అమ్మని కావిలించుకుంది. అంతే ఆ తల్లీ బిడ్డల హృదయాలు ఏవేవో అంతర్యాన్ని కలుపుకొని ఏకమైనాయి. "లేదమ్మా లేదు. ఇకెప్పుడూ తలపెట్టను. నువ్విలాగైనా బతికి బావుంటే నాకదే పదివేలు. వద్దు. ఏడవకు...మరింకొద్దు" అంటూ బిడ్డను తన గుండెలకు హత్తుకొన్నది. ★




దినదినమునకు ఇంక స్వచ్ఛమైనటువంటియు, ఇంక మనోహరమైనటువంటియునైన చర్మము

రెక్సోనాలోని కేడిల్‌తో ఈ అద్భుతమైన మార్పును మీరు తెచ్చుకొంటారు

రెక్సోనాయొక్క కేడిల్‌తోగూడుకొన్న నురుగును మీ చర్మముమీద బాగా రుద్ది తరువాత కడిగివేయండి. మీ చర్మము దినదినమునకు ఇంక మృదువుగాను, ఇంక స్వచ్ఛముగాను అగుటను చూస్తారు.




రెక్సోనా

ఇది ఒక్కటే కేడిల్*తో గూడిన సబ్బు

* చర్మమును పోషించేటటువంటియు, చర్మమును మెత్తగాచేయువటువంటియునైన నూనెల ఒక ప్రత్యేక మిశ్రమమునకు కేడిల్ పేరు.

RP. 100-50 TL

రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్‌వారి తరపున ఇండియాలో తయారుచేయబడినది